ఆంధ్రప్రభ - 26-10-1998

# రామరాజ్యంలో రంభ

అరకులోయ రంగరాయా కాఫీ ప్లాంటేషన్ విశ్రాంతి భవనంలో, పది రోజుల్నించి తనీ కాఫీ తోటల్లో సేకరించిన విషయాలనన్నింటినీ ఓ క్రమంలో సర్దుకునే ప్రయత్నంలో ఉండగా, కాపలా పనీ, వంట పనీ - రెండూ చేసే పెంచలయ్య గదిలో అడుగు పెట్టాడు.

"సార్! మా చిన్నవాడికి జ్వరంగా ఉందని కబురొచ్చింది. అందుకని ఈ రాత్రికి నేను ఇంటికి వెళ్లాలి. లేకపోతే నా ఆడది నా ప్రాణాలు తీసేస్తుంది. రేపు ఈ ప్రాంతంలో ఏదో సినిమా షూటింగ్ జరుగుతుందట, సినిమా హీరోయినూ, నిర్మాతా, దర్శకుడూ, ఈ సాయంత్రానిక్కానీ, రేపు కానీ రావొచ్చునని కబురంపాడు మా మేనేజరు. ఈ రాత్రికని, మీతో సహా నలుగురికి సరిపడే వంటచేసి కాసిరోల్సులో ఉంచి డైనింగ్ టేబుల్ మీద ఉంచాను. రెండు ఫ్లాస్కుల నిండా కాఫీ పోసి ఉంచాను. మీరు వారి కోసం ఎదురు చూడకుండా ఎప్పుడాకలైతే అప్పుడు భోంచేసి పడుకోండి. ఒకవేళ మీరు పడుకునే సమయానికి వాళ్లు కనక రాకపోతే, హాల్లోంచి బయటి వరండాలోకి వెళ్లే తలుపును వెయ్యండి కానీ లోపల గడియ పెట్టవద్దు. వాళ్ళు బయట నుంచి స్ప్రింగ్ లాక్ తెరుచుకుని, లోపలికి వచ్చి వాళ్ల మానాన వాళ్లు భోంచేసి పడుకుంటారు. మరి నే వెళ్లేదా?" అన్నాడు పెంచలయ్య రామారావుతో.

"ఆ వచ్చే సినిమా తార పేరేమిటి?" రామారావు కుతుహలంగా ప్రశ్నించాడు.

"ఇక్కడున్న కాఫీ తోటల యాజమానులందరికీ వాళ్ల గెస్ట్ హౌస్‌ల్ని సినిమా వాళ్ల కివ్వడం అలవాటే. చాలామంది వచ్చిపోతూంటారు. వచ్చేవాళ్లు వచ్చిన తర్వాత కానీ వివరాలు నాకు సాధారణంగా తెలియవు. అందులోనూ మా మేనేజరుకి ముందుగా వివరాలు చెప్పే అలవాటు లేదు. వాళ్లు వచ్చిన తర్వాత మీకే తెలుస్తుంది. అన్నట్టు మీరు రేపటి విషయం గురించి బెంగ పెట్టుకోవద్దు. నేను కానీ, మా పెద్దకుర్రాడు కానీ ఉదయమే వస్తాం!" అంటూ పెంచలయ్య బయటకు దారి తీశాడు.

పెంచలయ్య రామారావు దగ్గర సెలవు తీసుకుని వెళ్ళిన మరికొంతసేపటికి, బయట ఓ జీపు ఆగి వెళ్లిన శబ్దం వినపడింది. మరో క్షణంలో "లోపల ఎవరూ?" అంటూ ఓ గొంతు వినబడ్డంతో రామారావు తన గదిలోంచి హాల్లోకి వచ్చాడు. చేత్తో చిన్న సూట్‌కేస్ పట్టుకుని నిల్చున్న ఓ యువతిని చూసి రామారావు ఒక్క క్షణం తొట్రుపాటు పడ్డాడు. "ఈ గెస్ట్‌హౌస్

వాచ్‌మన్ పెంచలయ్య వాళ్ల కుర్రవాడికి జ్వరంగా ఉందని ఇంటికి వెళ్లిపోయాడు. రేపు ఉదయమే వస్తాడు. నా పేరు రామారావు. హైదరాబాదులో ఓ రిసెర్చి కంపెనీలో సైంటిఫిక్ ఆఫీసరుగా పనిచేస్తున్నాను. కాఫీ తోటల తెగుళ్ల విషయమై పరిశోధన చేస్తూ విషయసేకరణకి వచ్చాను. పెంచలయ్య చెప్పిన సినిమా తార మీరేననుకుంటాను?

"మిమ్మల్నీమధ్యనే ఓ సినిమా తెరమీద చూసినట్టు గుర్తు. మీతో నిర్మాతా, దర్శకుడు కూడా వస్తారన్నాడు, వాళ్లేరీ?" రామారావు తన వివరాలు చెప్పి, ఆ పైన ప్రశ్నించాడు.

"వాళ్లా? ఇక్కడికి రెండు కిలోమీటర్ల దూరంలో మయూరి సరస్సు దగ్గర బేస్ కాంప్‌లో ఉన్నారు. మూదువంతులక్కడే ఉండిపోతారు. ఒకవేళ వచ్చినా ప్రొద్యూసర్ ఒక్కడే ఈ రాత్రికి రావచ్చును. ఇంతకీ నా పేరు మేఘనందిని."

"అవును, గుర్తుకొచ్చింది!" అన్నాడు రామారావు.

"నేను కాస్త ముఖం కడుక్కుని వస్తాను. కబుర్లు చెప్పుకోవచ్చు!" అని మేఘనందిని రామారావు గదికి ఎదురుగా ఉన్న మరో గదిలోకి వెళ్లి ఓ పదిహేను నిముషాల్లో బయటకు వచ్చింది.

రామారావు ఫ్లాస్కులోని కాఫీ రెండు కప్పుల్లో పోశాడు. ఇద్దరూ చెరో సోఫాలో కూర్చుని, కాఫీ తాగుతూ కబుర్లలో పడ్డారు. ఓ గంట పోయిన తర్వాత, "నేను కాస్త విశ్రాంతి తీసుకు వస్తాను!" అని మేఘనందిని తన గదిలోకి వెళ్లింది.

నిండుచంద్రుడి వెండివెన్నెల్లో పొగమంచుతో కూడిన అరకులోయ వింతసోయగాలతో వెల్లివిరుస్తోంది. ముందు వరండాలో శాలువా కప్పుకుని కూర్చున్న రామారావు, వరండా చివరగా కర్రస్తంభానికానుకొని, లోయవైపు చూస్తున్న మేఘనందినిని కన్నార్పకుండా చూడసాగాడు. ధవళవస్త్రాలు ధరించిన మేఘనందిని, జాలువారిన శిరోజాలతో దివి నుండి భూమికి దిగివచ్చిన అప్సరసలా కనిపించింది. ఆ వెన్నెల్లో మేఘనందిని ఒంటి సొంపులు రామారావు మనసులో చిన్నగా కోర్కెల్ని రెచ్చగొట్టసాగాయి.

కుర్చీలోంచి లేచి వెళ్లి మేఘనందిని దగ్గరగా నిల్చుని, "మీరేమీ కప్పుకోలేదు, చలిగా లేదా?" అని నెమ్మదిగా ప్రశ్నించాడు.

"వచ్చే హడావుడిలో పై శాలువా తెచ్చుకోవడం మర్చిపోయాను. చూడండి, ప్రకృతి ఎంత మనోహరంగా ఉందో?" అంది మేఘనందిని.

"నా శాలువా తీసుకోండి!" అన్నాడు తను కప్పుకున్న శాలువా తీస్తూ.

"అబ్బే అక్కర్లేదు. ఈ మాత్రం చలి నా కలవాటే. ఇందాకా కాఫీ తాగుతున్నప్పుడు నేను నటించిన సినిమాలు ఒకటో రెండో చూశామన్నారు. 'రామరాజ్యంలో రంభ' అనే సినిమా చాలా ప్రజాదరణ పొందింది. ఆ సినిమా కానీ మీరు చూశారా? నాలుగు నెలల క్రితం విడుదలయింది."

"చూశాను జ్ఞాపకముంది"

"ఆ సినిమాలో, సిమ్లా మంచుకొండల్లో హీరో హీరోయిన్లు పాడిన పాటా, దృశ్యమూ మీకు

జ్ఞాపకం ఉండి ఉండాలి. ఆ పాటని చిత్రీకరిస్తోన్నప్పుడు వయసు మీరిన హీరో పాత్రధారి విగ్గు ధరించి, మెడ నుంచి పాదాల వరకూ ఉన్ని దుస్తులు ధరించి, బూట్లతో చిందులు తొక్కుతుంటే, బిగుతుగా ఉన్న పొట్టి దుస్తుల్లో, కాళ్లకి మేజోళ్లు కూడా లేకుండా చెప్పులతో నాతో స్టెప్పులు వేయించారు. ఆ చలిని భరించిన నాకు, హాయిని గొల్పించే ఈ చలి ఓ లెక్కలోనిది కాదు!" మేఘనందిని ఒక్క క్షణం ఆగి, మళ్లీ అంది – "ఇంతకీ ఆ పాట గురించి, దృశ్యం గురించి మీ అభిప్రాయం ఏమిటి?"

రామారావు కాస్సేపు ఆలోచించాడు. మనసులో గుర్తుకొచ్చిన పాట అప్రయత్నంగా పెదాలు దాటి బయటకు వచ్చింది.

"నీ ఎదల మీద గండు తుమ్మెద వాలింది ఎందుకో?
హిమవనంలో పూలమొక్కని భ్రమ చెందెను భ్రమరం!"

"అవును, అదే! మరి ఆ దృశ్యం మీ మీద ఏ విధమైన ముద్ర వేసింది?" మేఘనందిని కాస్త చిలిపిగా ప్రశ్నించింది.

రామారావు కాస్త సంకోచిస్తూ "మీరు నవ్వనంటే చెప్తాను!" అన్నాడు.

"నవ్వను, చెప్పండి. చదువుకున్నవారి అభిప్రాయం తెలుసుకోవాలని కుతూహలంగా ఉంది".

"కుటుంబంతో కలిసి వెళ్లి చూసిన చిత్రమది. చెప్పాలంటే, ఆ దృశ్యం చూస్తూ ఇబ్బంది పడ్డమాట వాస్తవం. కానీ.... కానీ మీ శృంగార హావభావాలు మగవారి హృదయాల్ని చిత్తుచేసిన మాట కూడా వాస్తవమే!".

"అంటే, పైకి పెద్దమనుషుల్లా ఇబ్బంది ముఖం పెట్టినా, అంతరంగాల్లో ఆనందించారన్న మాట! అందుకే నిర్మాతలూ, దర్శకులూ హీరోయిన్లని రోజురోజుకీ మరింత కురచ దుస్తుల్లోకి దింపేస్తూ, అదీ చాలక నీటిలో తడిపేస్తూ సెక్సీగా చూపిస్తున్నారంటే మీ ప్రేక్షకులే కారణం!" అంది మేఘనందిని నవ్వుతూ.

"నిందంతా ప్రేక్షకుల మీద వేయడం భావ్యం కాదు. ప్రజల అభిరుచి దృష్ట్యా అలా చిత్రీకరిస్తున్నామని మీరు నీతి పన్నాలు వల్లిస్తే, ధనాపేక్షతో మీరలా తీస్తున్నారని మేం కూడా ఎదురు సమాధానం చెప్పవలసివస్తుంది. అయినా తెర మీద దృశ్యాల్ని ఒక్కో ప్రేక్షకుడు ఒక్కోలా చూస్తాడు. నిజమైన స్పందన వాళ్ల హృదయాలకే తెలుస్తుంది."

"అవును, సినిమాల్లో శృంగార దృశ్యాలు నాలుగు డబ్బులకోసం తీసేవే! ఒక్క మాటడుగుతాను – ఆ పాటనీ, నా ఆటనీ చూసి వ్యక్తిగతంగా మీరు పొందిన స్పందన ఏమిటి?" – మేఘనందిని కొంటెగా ప్రశ్నించింది.

రామారావు సిగ్గుపడకుండా సమాధానం చెప్పాడు – "ఆ రాత్రి నా శ్రీమతి సినిమాలో మీలాగే చొక్కా ఒక్కటీ తొడుక్కుని, ఇంట్లో తిరుగాడుతూ ఉంటే, ఆమె అందాల్ని చూసి మురిసిపోదామని ఉబలాటపడ్డాను. అది మీ ప్రభావమే కదా? కానీ శ్రీమతి నా ఆశని నిరాశ చేసి, ఎప్పటిలాగే చీకటి ప్రణయాన్నే ప్రసాదించింది! సారీ, నా అంతరంగిక విషయాల్ని

చెప్పేస్తున్నాను!"

"అంటే, తెరమీది నా బొమ్మ మిమ్మల్ని రెచ్చగొట్టిందంటారు! నిజం చెప్పినందుకు సంతోషం. లోపలికి పదండి, త్వరగా డిన్నర్ ముగిస్తే మంచిది. ఎంత కాసిరోల్స్‌లో ఉంచినా ఎక్కువసేపు వేడిగా ఉండవు!" అంటూ మేఘనందిని లోపలికి దారి తీసింది.

రామారావు ఓ రెండు నిముషాలు లోయలోకి చూస్తూ ఉండిపోయాడు. ఆ తర్వాత వరండాలోంచి హాల్లోకి అడుగుపెట్టి తలుపు వేశాడు, హాలు మధ్య సీలింగ్ నుంచి వేలాడుతున్న ఆర్నమెంటల్ లాంప్‌షేడ్స్‌లోంచి వింత వింత కాంతులు మంద్రస్థాయిలో హాలుని నింపుతున్నాయి. గోడ నుంచి గోడ వరకూ పరిచిన నీలిరంగు సింథటిక్ తివాచీ, హాలు అందాన్ని మరింత ఇనుమడింపచేస్తోంది. మేఘనందిని హాల్లో లేదు. సోఫాలో కూర్చుని ఆమె గది వైపు చూస్తున్న రామారావుకి తన గది తలుపు తీసిన చప్పుడు వినబడి, అటువైపు చూసి ఒక్కసారిగా స్తబ్దుడైపోయాడు.

పై మూడు గుండీలు పెట్టుకోకుండా, తన నీలి చారల షర్టులో ఒయ్యారంగా డైనింగ్ టేబుల్ దగ్గరకు వెళ్ళిన మేఘనందిని చూసి ఆశ్చర్యపడిపోతూ, తనూ లేచి డైనింగ్ టేబుల్ దగ్గరకు నడిచి వెళ్ళి ఓ కుర్చీలో కూర్చున్నాడు.

మేఘనందిని బల్ల మీదకు ఒంగి డిన్నర్ ప్లేట్లని సర్ది పెడుతున్నప్పుడు, షర్టు పైభాగంలోంచి తొంగి చూసిన ఘన సంపదని తనివితీరా చూశాడు. పక్కనున్న షోకేష్ దగ్గరకు వెళ్ళి, పై అరలో ఉన్న గాజు గ్లాసుల్ని కాలివేళ్ళపై లేచి అందుకుంటున్నప్పుడు వెనుక వైపు షర్టు పైకి వెళ్ళగా, ఆమె జఘన సౌందర్యాన్ని చూసి ఆనందించాడు. గ్లాసులు బల్ల మీద పెట్టి, రెండు తడవలు నడుచుకుంటూ ఫ్రిజ్ దగ్గరకు వెళ్ళి నీళ్ల బాటిల్స్‌నీ, పెరుగ్గిన్నెనీ తీసుకు వస్తున్నప్పుడు, ఊరువుల నునుపునీ, షర్టులో కదలాడుతున్న ఎత్తుల్నీ చూసి రామారావు నరాలు ఉద్రిక్తత చెందాయి.

మేఘనందిని ఎదురు కుర్చీలో కూర్చుని, చేసి ఉంచిన వంటకాల్ని ప్లేట్లలో వడ్డించి ముందుకు బాగా వంగి, గుడ్లప్పగించి చూస్తున్న రామారావు బుగ్గ మీద గిల్లి, "ఈ లోకంలోకి రండి. మహానుభావా! తిండి తినందే బలం ఎక్కణ్ణుంచి వస్తుంది?" అంది నవ్వుతూ.

"మిమ్మల్నిలా చూస్తుంటే ఆకలి ఎప్పుడో ఎగిరిపోయింది!" అన్నాడు రామారావు.

"మీరు నా సినిమా చూసి ప్రభావితం చెంది, మీ శ్రీమతితో శృంగారం చెయ్యబోతే అది చీకట్లో చిందులాటకి దారితీసిందన్నారు. అది నా తప్పుగా భావించి, ఇప్పుడు మీ సరదా తీరుద్దామనుకుంటున్నాను, అభ్యంతరమా?" అంది మేఘనందిని కవ్విస్తూ.

"లేదు కానీ –" మాట మధ్యలోనే ఆపుచేశాడు.

"మీ శ్రీమతిని గురించి ఆలోచిస్తున్నారు కదూ?! 'శయనేషు రంభా!' అనే స్త్రీ ధర్మాన్ని మీ శ్రీమతి విస్మరించింది. అది ఆవిడ తప్పు. అయినా ఇందులో మీ ప్రయత్నం లేకుండానే, మీ సరదా తీరుద్దామని నేనే ముందుకు వస్తూంటే, అవకాశాన్ని వినియోగించుకోవడంలో తప్పేమీ

లేదు. ముందు భోజనం కానివ్వండి!" అంది మేఘనందిని హాయిగా నవ్వుతూ.

డిన్నర్ ముగిసిన తర్వాత రామారావు, తిన్న ప్లేట్లనీ, ఉపయోగించిన ఇతర వస్తువుల్ని తీసుకువెళ్లి కిచెన్ సింక్‌లో పడవేశాడు.

మేఘనందిని హాలు మధ్యకి నడిచి వెళ్లి నిల్చుంది. రామారావు కాస్త సంకోచిస్తూ నడిచివెళ్లి, ఆమె భుజం మీద చేయి వేశాడు. మేఘనందిని రామారావుని చెయ్యి పట్టుకుని అతని గదిలోకి తీసుకువెళ్లింది. ఆమె స్పర్శతో రామారావుకి మనసు అధీనం తప్పసాగింది.

అదే క్షణంలో గది కిటికీ అద్దాల మీద, ఏదో కారు హెడ్‌లైట్ల కాంతి ఒక్కసారిగా పడి మాయమైంది. దూరంగా హారన్ చప్పుడు వినపడింది. మేఘనందిని ఒక్క ఉదుట్లో మంచం దగ్గరకు వెళ్లి, కట్టుకున్న చొక్కా విప్పేసి, వెంటనే మంచం మీదనున్న తన దుస్తుల్ని అపాటిగా చుట్టబెట్టుకుని, "ప్రొడ్యూసర్ పాపారాయుడు వస్తున్నాడనుకుంటాను. మనిద్దరమూ వాడి కంటపడితే నా సినిమా జీవితానికి స్వస్తి చెప్పుకోవల్సిందే!" అంటూ బయటకు వెళ్లి, హాలు కడ్డంగా వడివడిగా నడుచుకుంటూ తన గదిలోకి వెళ్లి తలుపు వేసుకుంది.

ఒక్క లిప్త కాలం ఆమె సంపూర్ణ దేహసౌందర్యాన్ని చూసిన రామారావు తన శృంగార సౌధం మొదటి మెట్టు ఎక్కగానే కూలిపోవడంతో, నీరసంగా వెళ్లి తలుపు మూసి, తిరిగి వచ్చి మంచం మీద కూలబడి, పక్కనే ఉన్న టేబుల్ లాంప్ ఆర్పి, నిద్రకోసం ప్రయత్నించసాగాడు. హాల్లోంచి లీలగా వినబడుతున్న సంభాషణలూ, గిన్నెల చప్పుళ్లూ మనసుని కలవరపెడ్తూండగా, కలత నిద్రలోకి జారుకున్నాడు.

ఉదయిస్తున్న సూర్యుడి కిరణాలు కిటికీలోంచి ముఖం మీద పడ్తోండగా రామారావుకి మెలకువ రావడం, తలుపు మీద ఎవరో తడ్తున్న చప్పుడు వినబడ్డం ఒకేసారి జరిగాయి. రామారావు వెళ్లి తలుపు తీశాడు. పెంచలయ్య కాఫీ ట్రేతో లోపలికి వచ్చి, దాన్ని మంచం పక్కనున్న చిన్న బల్లమీద పెట్టాడు. "నిన్న రాత్రి నేను నిద్దట్లో ఉండగా ఆ సినిమా వాళ్లెవరో వచ్చారనుకుంటాను. వాళ్లు గదుల్లో ఉన్నారా!" రామారావు కాస్త నిజం దాచి పెంచలయ్యని ప్రశ్నించాడు.

"కిచెన్ సింక్‌లో ప్లేట్లు చూసి, వాళ్లూ వచ్చి ఉంటారని మార్నింగ్ కాఫీ తీసుకువెళ్లాను. వాళ్లెవరూ గదుల్లో లేరు. షూటింగ్‌ల కోసమని పెందరాళే పరుగెత్తుకు వెళ్లడం వాళ్లకి మామూలే! బేస్‌కాంప్‌లో కూడా వాళ్లకన్ని ఏర్పాట్లూ ఉంటాయి. మీకో గంటలో బ్రేక్‌ఫాస్ట్ రెడీ చేస్తాను!" అని పెంచలయ్య గది నుంచి బయటకు వెళ్లాడు.

ఆ మధ్యాహ్నం రామారావు తను వచ్చిన పనయిపోవడం వల్ల కాఫీ ప్లాంటేషన్ యాజమాని పంపించిన జీపులో విశాఖపట్నం వెళ్లి, మర్నాడుదయం ఫ్లయిట్‌లో హైదరాబాదు వెళ్లిపోయాడు. మధ్యాహ్నం భోజనం చేస్తున్నప్పుడు ఉండబట్టలేక, "మొన్న అరకువాలీలో ఏదో సినిమా షూటింగ్ జరిగింది. సినిమా తార మేఘనందినిని చూశాను!" అన్నాడు వసంతతో.

"మీరంతా అయోమయం మనిషిలా ఉన్నారు! ఇల్లూ ఆఫీసు తప్ప మీకు మరో ధ్యాస

ఉండదు! మీరు అరకు బయలుదేరిన రోజే, మేఘనందిని అరకువాలీలోని మంజీరా జలపాతం దగ్గర షూటింగ్‌లో ప్రమాదవశాత్తు కాలు జారి ప్రవాహంలో కొట్టుకుపోయి మరణించింది. పేపర్లో వచ్చింది. మీరెవర్ని చూసి ఎవరనుకున్నారో?" అంది వసంత.

రామారావు గుండె జలదరించింది.

ఆ రోజు సాయంత్రం రామారావు ఆఫీసు నుంచి ఇంటికి ఆలస్యంగా వచ్చాడు. వస్తూనే, "వసంతా! ఈ రాత్రికి మేనేజింగ్ డైరెక్టర్ విదేశీనిపుణులకి 'లేక్‌వ్యూ' హోటల్లో డిన్నరిస్తున్నాడు. వెధవది, ఇంత వర్షంలో వెళ్లాలి. పాంట్లు మడతవి ఉన్నాయి కానీ, షర్టులే లేవు. ఇవ్వాళ ఉదయం నువ్వు ఉతికిన షర్టుల్లో ఒకదాన్ని కాస్త ఇస్త్రీ చేసి పెట్టు!" అన్నాడు.

వసంత ఉతికిన బట్టల్లోకి చూస్తూ "ఈ నీలం చారల చొక్కా చేసేదా?" అని అడిగింది.

"ఏదో ఒకటి ఇస్త్రీ చేసి త్వరగా తీసుకురా"! అన్నాడు బూట్లకి పాలిష్ చేసుకుంటూ.

వసంత చొక్కా తీసుకుని పక్క గదిలోకి వెళ్లింది.

రామారావు బాత్‌రూమ్‌లోకి వెళ్లి, స్నానం చేసి బయటకొచ్చాడు. "వసంతా! షర్టు ఇస్త్రీ అయిందా?" అంటూ గట్టిగా అరిచి, వార్డ్‌రోబ్‌లోంచి కోటు తీసి బ్రష్ చేయసాగాడు.

"బయట అంత వర్షంగా ఉంటే ఈ పాడు డిన్నర్లూ అవి ఎందుకూ? మీరు వెళ్లకపోతే కొంపేమీ మునగదు! హాయిగా ఇంట్లో ఉండండి!" – గుమ్మంలో నిల్చుని వసంత అన్న మాటలు విని రామారావు తలెత్తి చూశాడు.

పెదాలకి లేత గులాబీ రంగు, జుట్టుకి రబ్బర్ బాండ్ వేసుకుని పోనీ టైల్ – పై మూడు గుండీలు విప్పిన నీలి చారల షర్టులో వసంత వెలిగిపోతోంది! అరటి మానుల్లా నునుపైన ఊరువులూ, షర్టు పైభాగంలోంచి లీలగా దర్శనమిస్తున్న ఘనరాశులూ..... రామారావుకి చిత్తభ్రమణం కలిగించాయి. వసంత ఒయ్యారంగా నడుచుకుంటూ వెళ్లి, రామారావు చెయ్యి పట్టుకుని, "మీరు బయటకు డిన్నర్‌కి పోతే, నేను చేసిన వంటేం కాను? పదండి భోజనానికి!" అంది గారాలు గునుస్తూ.

"భోజనం సంగతి తర్వాత. ముందీ శృంగార వసంతాన్ని అనుభవించనియ్యి!" అంటూ రామారావు వసంతని రెండు చేతుల్లో అమాంతం ఎత్తుకుని మంచం మీద పడుకోబెట్టాడు.

వసంత లేచి వెళ్లి లైటార్పే ప్రయత్నం చెయ్యలేదు.

మేఘనందిని చేసిన మేలుకి రామారావు మనసులోనే ఆమెకి కృతజ్ఞతలు అర్పించుకుంటూ, వసంత తొడుకున్న నీలి చారల షర్టు మీద అప్యాయంగా నిమిరాడు. అతని సైంటిస్ట్ బ్రెయిన్ కూడా నమ్మక తప్పలేదు.

జీవించి ఉన్నప్పుడు సంసార జీవితానికి నోచుకోని తన దురదృష్టానికి చింతిస్తూ, ఇప్పుడు తన దీవెనతో– శృంగారరహితమైన జీవితాన్ని గడుపుతున్న రామారావు జీవన ప్రాంగణంలో శృంగారహేల విరబూసినందుకు మరోపక్క సంతోషిస్తూ ఆకాశంలోంచి మేఘనందిని కారుస్తున్న దు:ఖానందాశ్రువులు, ధారాపాతమైన వర్షంగా కురుస్తున్నాయి.